మనసు ఫౌండేషన్
MANASU FOUNDATION - e Chitrapuri
PM DRF: 1301/001
TITLE: Praavahaganam
i

ప్రవాహగానం



ప్రవాహగానం

— దాము

— అప్పసారు ప్రచురణలు —

చిత్తూరు

"PRAVAHAGANAM"

Telugu - Poetry by DAMU

May 1996

Rs. **20/-**

APPASARU PRACHURANALU
2-600, Satram Street,
Kongareddy Palle,
CHITTOOR - 517 001

Type Setting by
SRI VINAYAKA GRAPHICS
300, IInd Floor, T.K.Street,
TIRUPATI - 517 501. Ph:24858

Cover Page designed by
Ganesh Achari

DESIGNS: **Annamalai**

Printed by Mano Printers
69, Triplicane High Road.
Triplicane, Madras - 600 005.

౹౦ ఏప్రిల్, ౨౧౬ న కడపజిల్లా గుట్టపల్లి దగ్గర నాలుగు కలోల్ల జీవితాల్ని రాజ్యం ఛిద్రం చేసింది.

- మృదువుగా, Concerned గా వుండే అప్ప పార్టీలో అందరికంటే నాకు సన్నిహిత ప్రియతముడు. ఎంత గొప్ప మాస్‌లీడరో అంత సున్నిత మనస్కుడు. మంగలికృష్ణప్ప.
- అక్క నిర్మలక్క. డెన్ ఏకాంతంలో యేళ్లకు యేళ్ళు ఒంటరియై, ఏ తెలియని ఆదర్శమో అయి, దాన్ని తల్చుకొని కోపమ్మై, కన్నీళ్లై Burst అయ్యే అక్క
- జనార్థన్ నా మిత్రుడు. ఉద్యమాన్ని స్పీడ్‌గా అభివృద్ధి చేయాలని కలలు కంటూ .... కంటూ వెళ్లిపోయాడు.
- సుధాకర్. అమాయకత్వం, నిష్కపటత్వం, ఎన్ని కష్టాలున్నా ఓర్పుగా చిరునవ్వులు చిందించే బాల్యం.
- వాళ్ల ఆచరణలో, అమరత్వంతో నా అస్థిత్వంలో కలసి పోయిన. ఈ నలుగురికీ ....

స్నేహంతో, ప్రేమతో

దాము

మా దాము...

ఈ కాలం వీరుడు, ఆశబోతు, మొండివాడు, తాగుబోతు, మూర్ఖుడు, కళాకారుడు, విప్లవకారుడు అనేక రూపాలెత్తే ప్రవాహం.

శ్రీకాళహస్తిలో ఇంటర్ మీడియట్ ఎం.పి.సి. గ్రూపులో చేరి రెండు సంవత్సరాలు గాలిగా తిరిగి పాసుకాకుండా మళ్ళీ నాగలాపురంలో ఇంటర్ సి.ఇ.సి గ్రూపులో చేరి కాలేజి కి ఫస్టు వచ్చాడు. ఆ కాలేజిలో సి. ఇ.సి. గ్రూపుతో కాలేజి ఫస్టు రావడం అదే మొదటిసారి. ఆ మధ్యలో మద్రాసు అమరావతి హోటల్‌లో కొంతకాలం పన్చేసి తిరుపతి యస్.జి.యస్. ఆర్ట్స్ కాలేజిలో బి. ఏ. అడ్వాన్స్ ఇంగ్లీషులో చేరి క్లాసులకి వెళ్ళకుండా రాత్రంతా రష్యన్ సాహిత్యం చదివి పగలు హాస్టల్లో నిద్రపోయేవాడు. బి. ఏ.లో ఫస్టు క్లాసులో పాస్ అయ్యి తరువాత యస్.వి.యు. లో ఎం. ఏ. ఇంగ్లీషులో చేరి అక్కడి లెక్చరర్ల తలపొగురికి అజ్ఞానానికి 'మార్కులు మా దగ్గరుంది జాగ్రత్త' అనే బెదిరింపులకి తిరగబడి చదువు మానుకొని జీవితంలో పడ్డాడు. ఆ యూనివర్శిటీలో కన్నా అవలాగాళ్లని నేను ఎవ్వర్ని చూడలేదని అప్పుడప్పుడు చెప్పేవాడు. ఈ యస్.వి. యూనివర్శిటిలో విద్య లేదు విద్యా తృష్ణలేదు వున్నదంతా కులతత్వం ఈ యూనివర్శిటీని అర్జంటుగా మూసేసి ధర్మశాలగా మారిస్తే తిరుమల యాత్రికులకి కనీసం బస వసతైనా దొరుకుతుంది అనేవాడు. అడ్డదార్లలో డబ్బులు సంపాదిద్దామన్న ఆశతో లుంపెన్ మిత్రుడి మాటలకి మోసపోయి బాంబే వెళ్ళి బోర్లాపడి ఆకలితో అవస్థలు పడి మళ్లీ తిరుపతి చేరి టీచర్‌గా మారాడు. విశ్వం స్కూలులో ఇంగ్లీషు గ్రావమర్ చెప్పాడు. సెక్సు కోసం జిల్లాలో చాలా సందులుగొందులు, ఊర్లు ఏర్లు తిరిగాడు. ఇద్దరు వేశ్యల్ని వంచి మిత్రులుగా మిగుల్చుకున్నాడు. పిచ్చాటూరులో స్కూలు పెట్టి దానిని క్రమబద్ధంగా నిర్వహించక ఇంటకి ముప్పైవేలు అప్పుపెట్టాడు.

అంతాప్రశ్నలేమిగిలాయి. భద్రజీవితంకోసం సివిల్ సర్వీసస్‌లాంటి వాటి కోసం చదవాలా? అరాచక తిరుగుబాటు గాలివాటుకి జీవితాన్ని వదిలిపెట్టాలా? అనే క్రాస్ రోడ్స్ కి బతుకొచ్చిపడింది. ఈ క్రాస్ రోడ్స్‌లో పాతుకుపోయిన హిపోక్రాటిక్ విలువల్ని కసిగా నిరాకరించే అరాచకపు దారి నుంచి వ్యవస్థీకృతమైవున్న విలువల్ని దాని వెనుదన్నుగా

వున్న పీడనాత్మకమైన వ్యవస్థని వ్యతిరేకించేదారిలో వెళ్లడానికి నిర్ణయించుకున్నాడు. పౌరహక్కుల వుద్యమంలోభాగం అయిన తర్వాత ఫుల్‌టైమర్‌లాగ జిల్లావ్యాపితంగా అర్ధాకలితో, ఆకలితో తిరిగి ఆరోగ్యం చెడగొట్టుకొని ఏండ్ల తరబడిఅనారోగ్యాన్ని మోసాడు. ఎక్కువమంది విప్లవోద్యమంలో పనిచేయలేక బయటకొచ్చి పౌరహక్కుల వుద్యమంలోనో, విరసంలోనో చేరుతారు అలాకాక దాము పౌరహక్కులవుద్యమం నుంచి విప్లవోద్యమంలోకి వెళ్ళాడు. ఇప్పుడు దాము వృత్తి విప్లవకారుడు. రాడికల్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు **11.5.96** న పలమనేరులో అరెస్టు చేయబడి ప్రస్తుతం జైలులో వున్నాడు.

ఏ పని చేసినా చావో బతుకోలాగా చేయడమే మాదాముకి చేతనవుతుంది. తన లక్షణాల్ని అభిరుచుల్ని అందరి మీదా రుద్దడంలో ఇంతకన్నా మించిన మానిపులేటర్‌ని నేను చూడలేదు. కొంచెం తావిస్తే అంతా ఆక్రమించేసే అరెబియా ఎడారివాని ఒంటె మా దాము. సంవత్సరాలుగా ఈ దెయ్యం నీడ నా మీద పడకుండా వుండటం కోసం ప్రయత్నం చేస్తూనేవున్నాను.

కవి చేయాల్సిన పనిని సంకలీకర్త చేయకూడదని భావించి కవి పేర్లు పెట్టకుండా వదిలేసిన వాటికి పేర్లు పెట్టే భాద్యత తీసుకోలేదు. ఈ కవిత్వాన్ని సంకలీకరించేటప్పుడు, ఏ క్రమాన్ని కానీ పద్ధతి గానీ పాటించలేదు.

ఇపుడు ప్రధానంగా అకవిత్యం రాజ్యమేలుతున్నది. వ్యాసాలు మాత్రమే రాసుకోవలసిన వాళ్ళందరూ కవులు, రచయితలైపోయి మన జీవితాలకి మట్టికి ఏ మాత్రం సంబంధం లేని కనీసం వాసన కూడా లేకుండా పేలవంగా 'భావాల్ని' ప్రచారం చేస్తున్నారు. దాము కవిత్వం అతని కసి ఘర్షణ తనను తాను నిర్వచించుకునే ప్రయత్నం, కళాత్మక సౌందర్య సత్యాన్వేషణ ఒక్కోసారి ఉన్మత్త ప్రేలాపన. ఎప్పుడూ భోదకునిగాను, మార్గము చూపువానిగాను ప్రచారధ్యేయం తోను మాత్రం కవిత్వం రాయలేదు. కవిత్వం అతని దారి. మా దాము జీవితంలోనే కవిత్వం, సంగీతం వుంది. అత్తిపత్తి లాంటి దాము బహుముఖంగా రికార్డు చేసిన ప్రవాహగానం వినండి.

3.5.96 — వుంటానిక

తిరుపతి — మునిక్రిష్ణ

ఎచట గడ్డి పరక శిరము వాల్చినా
అచట నీ అడుగు జాడలకై అన్వేషణ



ఒంటరితనం మిత్రమా ఒంటరితనం
ఏడ్వు జలపాతాల్ని సృష్టించే పర్వత శిఖరాగ్రపు ఒంటరితనం
ఒంటరితనం మిత్రమా ఒంటరితనం
గుండెతాగ్రోడ్డు మీద వేన వేల వాహనాలు
పరుగులిడుతున్న ఒంటరితనం
ఒంటరితనం మిత్రమా ఒంటరితనం
ఆలోచనల సరిహద్దులలో కాల్పులు జరుపుతున్న ఒంటరితనం
ఒంటరితనం మిత్రమా ఒంటరితనం
బంధిత వ్యాఘ్రపు గర్జన లాంటి ఒంటరితనం
ఒంటరితనం మిత్రమా ఒంటరితనం
మొండెం కోల్పోయి కోటగోడకి వేలాడుతున్న
తల ఒంటరితనం.

నిల్‌బాలన్స్

కాలం ఎడారిలో జ్ఞాపకం
ఒంటె నడిచి పోయిన గుర్తులు మినహా
ఏమీ మిగిలేటట్లు లేదు
ఎవరూ వచ్చేటట్లు లేదు
ఏమీ జరిగేటట్లు లేదు
అమెజాన్ నదిలా వంకర్లు తిరిగిన ఆలోచన
ఏ నాగరికతనూ ఆహ్వానించేటట్లు లేదు
రాయలసీమ నెర్రెలు వారిన భూమి మీద
ఏవర్షం కురిసేటట్లు లేదు
చూచినంత మేర డ్రయిలాండ్ విస్తీర్ణపుదుమ్ము
ఇప్పట్లో మణిగేటట్లు లేదు
ఎవరూ వచ్చేటట్లు లేదు
ఏమీ జరిగేటట్లు లేదు
అమనిషత్వపు ఆకాశం నుంచి
అబద్ధాల కుండపోత వర్షంలో
తడుస్తున్న ఈ జీర్ణ పర్ణశాల వేపుగా
గొడుగు పట్టుకొని ఎవరు వచ్చేటట్లు లేదు
తడి తగిలేటట్లు లేదు
ఏమీ జరిగేటట్లు లేదు.

యివాళ పాఠం చెప్పలేను

నిత్యం అబద్ధాలు బోధించే నోటితో
యివాళ నా మిత్రుడి హత్య గూర్చి ఎవరికీ చెప్పలేను
ఒక్కడు కాదు.... నామవాచకమే లేదు.
మాయ ఒరలోంచి అదేపనిగా కత్తులు తీస్తున్నట్టు
మృత్యువు... మృత్యవు..... మృత్యువు
నా విద్యార్థులారా
యివాళ మీకు సెలవు
స్కూళ్లకు రాలేని బాల్యాన్ని గూర్చి మీకెవరూ చెప్పరు.
రోడ్డు మీద గంతులేస్తున్న నా ప్రియమైన చిన్నా
నీకివాళ ఏ అమ్మా చనుబాలివ్వదు
రొమ్మునుంచి రక్తం కారుతున్న విషయం మాత్రం
నీకు చెప్పను.
భవిష్యత్తు నిండా మీ కలల్ని నలిపేస్తారనే
నిజం యిప్పుడు మీ కంఠతా పట్టించను
అవును నా బాల మిత్రులారా
యివాళ పుస్తకం తెరవను
గొంతు నిండా దుఃఖం పూడుకుపోయింది
తుపాకి దగ్గర తప్ప ఎక్కడా వంగని వేలితో
బోర్డు మీద యేం రాయను?

5-6-93

మధ్య తరగతి మగవాడు

పర్వాలేదు

సగం పూర్తికాని కవితలాగే ఉండు
రహస్యాన్ని పూర్తిగా చెప్పకు
చివరి కంటా కలగనకు
ఎవరు నడుస్తున్నా తోడు రాకు
నిద్రపోయిన మనిషిని మాత్రమే ప్రేమించు
సమస్యలేదు
తెల్లారక ముందే ఛాయ్ తాగు

పిల్లవాడి ఏడుపుతో భార్యని లేపు
నాల్గు మాటలను రెండు దెబ్బలు కొట్టు
ఏం అనుకోదులే - అయినా మనకేం మగరాజులం
శరీరం వెచ్చనయినప్పుడు తప్ప
ఎప్పుడూ ప్రేమ చూపించకు
అసలే ఆడవాళ్ళు-
ఏముండదులే
జాగర్తగా బడికి వెళ్ళు
పాఠాలు తప్ప ఏమయినా చెప్పు
'ప్రభుత్వ పాఠశాల లుండాలి
కానీ అందులో పిల్ల లుండకూడదు'
మంచిదే కోరిక - అదను చూసి వుద్యమించు
ఏం ? చీటీ కట్టాలా, తొందరొద్దు
రేపు కదా రెండోతేది
ఏమీ జరగదులే
గల్ఫ్‌లో యుద్ధం - కొంచేపు మాట్లాడు
ఒక క్షణం పేలుతున్న నగరం మీద
మరోక్షణం దివ్యభారతి విషాదం మీద
భేష్! ఎప్పడూ తీవ్రంగా స్పందించకు
జ్వరం రావచ్చు, ఏడుపు రావచ్చు, కసిరాజుకోవచ్చు
అదేమంత మంచిది కాదు
ఏ మెరగనట్టే వుండు
శవం సంగతి తెలీనట్టే బతుకు

6-6-93

అవును మానవుడా విను
ధైర్యంగా రెక్కలు విప్పుకొన్న నిజాల్ని విను
మళ్లీ నిద్రలోకి తప్పించుకోకముందే
చెవులు తెరువు
అక్కడొక వూరు వున్నట్టు
యిప్పుడు గుర్తులేవీ లేదు
మనుషులు రక్తమై చలనంలోకి స్రవించినట్టు
స్మృతులేవి లేవు.
జ్ఞాపకాలు కూడా ఎగుమతి సుంకం చెల్లించ లేక
కుళ్లి పోయాయి.....
ఒకే ఒక్క నడిచి వచ్చిన మనిషి
అడవిలో చెట్టై అటూ యిటూ వూగుతున్న
చప్పుడు తప్ప మరే కదలికా లేదు
పుట్టని బిడ్డ కేర్ మనడం మర్చి పోయాక
అక్కడ ఏ పువ్వులూ వికసించడం చూడలేదు
దారికాచిన బందిపోటు హఠాత్తుగా మీద పడ్డట్టు
యే చేటుకాలం వూరి మీద పంజావిసిరిందో
సాక్ష్యం లేదు
ఉన్న ఒక్క గోడా స్థూపం కాలేక పోయినందుకు
పొడి పొడిగా చచ్చి పోయింది.
[పుట్టిన తర్వాత మరణించిన వాడికోసం
నేనిపుడు మౌనం పాటించదలచుకోలేదు
మరణించిన తర్వాత పుట్టిన వాడికోసం
నేనిప్పుడు ఖడ్గ ధారణ చేయదలచుకున్నాను.]

రాత్రి 10.30, 28-5-96

చావడం మర్చిపోయిన వాడు

కత్తి పట్టుకొన్న వాడొకడు
ఎప్పుడూ మనల్ని ఫాలో అవుతాడు
నిజం
అరచేతి మందమంత రోత
రహస్యంగా గుండెల్లో పారుతుంటుంది
తన విద్యార్థినిని కామించిన టీచరులా
అంతరంగం గుర గుర మంటూనే ఉంటుంది
శత్రు శిబిరం లోంచి రహస్యంగా
పారిపోయి వచ్చిన ఖైదీ ఒకడు

మన చెవిలో పాట పాడుతాడు
గులాబీ పువ్వుతప్ప ఏమీ కన్పించని
మసక సంధ్యలో మన లోపల్నించి
ఒక మాసిన గడ్డపు బిక్షగాడు వళ్ళు విరుచుకొని లేస్తాడు
చావు లాంటి చోట మనం ఒంటరిగా ఒకటే నవ్వుకొంటాం
నిషిద్ధ నగరం నిండా తిరుగుతున్న
యుద్ధ శకటాల్లాంటి ఆలోచనల్లతో
మనం స్నేహితునితో కరచాలనం చేస్తాం
గాయపడిన రోడ్లమ్మట అక్షరాల
గంపల్ని నెత్తికెత్తికొని ఒకటే పరుగుదీస్తాం
రెక్కలు తెగిన పక్షే కూడా ఎగురుతున్నట్టే వుంటాం
చుట్టూ శరీరాలు దృశ్యాలు దృశ్యాలుగా
స్మశానాలై కాలుతాయ్
మనం సకుటుంబ సమేతంగా పెళ్ళికి వెళతాం
హఠాత్తుగా మన యింట్లో ఒక లోహసముద్రం
వళ్ళు విరుచుకొంటుంది.
మనం Jokes for all లోకి పొట్ట చెక్కలవుతాం
RDX నగరాన్ని చచ్చిన ఎలుకలా కిటికీ లోంచి
బయటకు విసిరేయాలని వ్యర్థ ప్రయత్నం చేస్తాం
మన తల్లులపై అత్యాచారాల్ని కళ్ళారా చూడగలిగినప్పడే
మనమేమిటో మనకి అర్థమయిపోయాం
బాల్యం నిండా మందుగుండు వాసన నింపిన
మందుల కంపెనీవాడితో మన కూతురు లేచి పోతుంది.
యింకా మనం మనిషిలా నటిస్తూనే తిరుగుతాం
బిడ్డల కోసం కలల్ని పాదగాలనుకొన్న క్షణంలో
నిద్ర నిషేధింపబడింది
చావడం మర్చి పోయిన వాడిలా మనం
ఒకటే జీవిస్తాం...

20-5-93

మరొకడు

కుంచెతో అమాయకంగా
కవిత్వం రాసుకొంటున్న యువకుడి ముందు
రక్త చారికలు కట్టిన ఒక సహస్రముఖుడు
ప్రత్యక్షమయ్యాడు
ఉచ్ఛ్వాస, నిశ్వసాల గుండా ప్రవహిస్తున్న
చరిత్ర నిండా చెమట వాసన గుప్పమంది
గరగర మంటున్న యంత్ర స్వరంతో
'యువకుడా ! 21 వ శతాబ్దపు యినుప చెమటనుంచి
నన్ను విముక్తం చెయ్యవా'
ఒక కవి, ఒక ప్రేమికుడు, ఒక నిజధారి
తమ పూర్వీకుల లోహ సముద్రంలోకి
ప్రవహించాడు
కాలం వూపిరి బిగపట్టింది.

13-4-93

ఎవరికి తెలియదు నన్ను గూర్చి
నీడల మధ్య
ఉరితాళ్ళ క్రింద వూపిరి పీలుస్తున్న సంగతి
ఎవరికి మాత్రం ఎందుకు తెలియదు
నన్ను నేను వ్యక్తం చేసుకోలేని అశక్తున్నని
తలక్రిందులుగా నటించడం కూడా తెలియదని
రుజాగ్రస్త అనల హోమంలో కూర్చొన్నాని
నడుస్తూ నడుస్తూ పలిగెత్తే వాన్నని
ఎవరికి తెలియదు నన్ను గూర్చి
తలలో రాలుతున్న జుత్తు
కళ్ళకింద వలయాల్లోకి పాకుతున్న చీకటి
అరిగిన చెప్పల్ని ఈడుస్తున్న కాళ్ళు
అందర్లోకి తొంగిచూడాలనే ఆదుర్ధ
ఎవరికి మాత్రం ఎందుకు తెలియదు
కొత్తదనం పై మోజు
నిన్ననుంచి వేర్ల తెంపుకోలేని అభద్రత
చీకటిలోకి చూడలేని అవిటితనం
పాచికంపు రోజుల్ని నెమరేయలేని జీర్ణశక్తి
జ్ఞాపకాలు దాచుకొనేందుకు రహస్యపు అరకోసం వెతుకులాట
దిండు క్రింద సెక్సు బుక్కు
గుండె క్రింద అనీజీ బురద
ఎవరికి తెలియదు నన్ను గూర్చి

అంతిమ విజయం

చెప్ప చెప్ప

గోబెల్స్ మాస్క్ ధారీ
'నిజం మీద నిలువెత్తు తారుపూయ్
నీతి లేదు, త్యాగాలకు వెలలేదు
సిద్ధాంత రాహిత్య చారలపులి
జనారణ్యం మీద పంజా విసురుతున్నది.'
మా సిద్ధాంతమేదో నువ్వే నిర్ణయించు
మా వ్యూహమూ - ఎత్తు గడలూ నువ్వేరచించు
'మీకిది ఉండాల' ని చెప్ప
'మీకిది లేద'ని ని చెప్ప
మా గతాన్ని కీర్తించు
మా వర్తమానాన్ని వంచించు
'తెలంగాణా పోరాటం గొప్పది - శ్రీకాకుళమా వట్టి హింస'
'శ్రీకాకుళం గొప్పది - నేడా వుత్తి దుస్సాహసికత్వం - టెర్రరిజం'
అరే! హంతకుడా తన సింహాసనం కోసం హత్యలు
చేసినవాడు, వేయిన్నొక్క శిరస్సులు ఖండించిన వాడు
ఎన్నడైనా నిజం చెబుతాడా-
ఒరే! శత్రువా యింకా తయారుకాని మా
సాయుధ జనసమూహాలు నీక్కనిపించవు
నిర్బంధపు యినుప పూచనుంచి తుపాకీ
తయారు చేస్తున్న మా మట్టి మనుషుల ధీరత్వం
నీ కంటి కానదు
మేం ఓడి పోతాం ఓడిపోతాం ఓడిపోతాం
వేయిన్నొకటోసారి గెలుస్తాం. Dooms Day గెలుపు మాదే

27-5-93

ప్రతీకారం

గాయం మీద గాయం
హత్యవెంట హత్య
ఓ యాత్రికుడా
మా రాజ్యంలో మానవులంతా
ప్రేమించడం మరిచిపోయారు
మాంసం కూరిన సంచుల నిండా యుద్ధపు కమురు వాసన!
చూచినంత మేరా శవాలు
పిడికిళ్ళు బిగిస్తున్న దృశ్యం
చలించి పోయిన వృద్ధ మహిళ
వణుకుతున్న స్వరంతో నినదించింది
'భవిష్యత్తు మీదే నా బిడ్డలారా!
హంతకుడిని హత్య చేయడం తప్ప శవానికి మరో
మరో మార్గంలేదు
ఆశ్చర్యం! ఎక్కడ చూచినా
పుట్టిన ప్రతిబిడ్డా ఆయుధ ధారియై
ధగ ధగలాడుతున్న దృశ్యం

వాడు

వాడు చెట్టుచాటు నుంచి
చావుని వర్షించగలడు
విశ్వాసంగా 'తపస్సు' చేసుకొంటున్న
వాడి తల ఎగరగొట్టగలడు
వాడి పేరు జపిస్తున్న వారి ముక్కు
చెవులు కోయగలడు
ఎన్ని అగ్ని స్నానాలు చేసినా
ఛీత్కారంతో సహచరిని
అనుమానించగలడు
కపటత్వం వాడి చర్మంపై కప్పబడింది
వట్టి పుణ్యానికే
వేలాది మందిని నాశనం చేస్తాడు
నగరాల్ని తగల బెట్టించి
వినోదిస్తాడు
కపటత్వంతో వంచనతో
కుట్రతో కుత్తుకలు కోస్తాడు
యిన్నీ చేసి
ధర్మాత్ముడై 'పోజివ్వ' గలడు
వాడెవడైనా కావచ్చు
చరిత్ర శిథిలాలనుంచి
ఎప్పడైనా పునరుత్థానం పొంద వచ్చు
వాడు రాముడు కావచ్చు, హిట్లరు కావచ్చు
వాడు 'అద్వానీలు' కావచ్చు

10-5-93

కొందరు యువకులు

బహుశా మనం
మరోసాయంత్రం కలుసుకొంటాం
ఒకరి రెప్పల్లోకి మరొకరు నిశ్శబ్దంగా
సూదులు గుచ్చుకొంటాం
మృదువుగా కరచాలనం చేసుకొంటాం
సిగరెట్ల కొసల్తో కాలాన్ని ముట్టిస్తాం
బహుశా మనం
నూర్జహాన్ పాశవిక సౌందర్యంతో
కాసేపు ఆడుకుంటాం
ఆమె మెత్తని పాదాల క్రింద
హృదయాలు పారేసుకొంటాం
అక్కడి రెడ్‌లైట్ సముద్రంలోకి మనల్ని పొదవుకుంటాం
బహుశా మనం
ఒక మధ్యాహ్నం పూట సలసల మరిగిపోతాం
నాగలిచాలు లోకి నడిచిపోతాం
పచ్చ పచ్చగా ధగ ధగ లాడుతాం
ఎండలో ఆయుధాలై మెరుస్తాం
స్వచ్ఛమైన యౌవనంతో యుద్ధాన్ని ఆవాహిస్తాం
బహుశామనం
మృత్యువును మరచిపోతాం
అందరం ఒక మహాధిక్కారమవుతాం
మనం దిగి వచ్చిన కొండ కభిముఖంగా
పిడికిళ్ళెత్తుతాం!

-౩-౯౨

మృతుడి స్వప్నం

ఇప్పుడిక తప్పేదేముంది
పుట్టడం మానుకోక ముందే
జీవించెయ్యాలి
రాజ్యంలోకి రాకముందే
ఆయుధమై పోవాల్సింది
ఇప్పుడిక ఆగేదేముంది

మరణించడం నేర్చుకోకముందే
మృత్యువుతో పోరాడాలి
మళ్ళీ తెలివిరాక ముందే
కలగనాల్సింది
ఇప్పుడిక చేసేదేముంది
ట్రిగ్గర్ నొక్కకముందే
వెనక్కి నడవడం మర్చిపోక ముందే
పడుకోనుండాల్సింది
ఇప్పుడిక పాడేదేముంది
బడికి వెళ్ళక ముందే
సైన్యంలో చేరాలి
బెల్లు కొట్టకముందే
పుస్తకాల్ని తగలబెట్టాల్సింది
ఇప్పుడిక నవ్వేదేముంది
కళ్ళు తెరవకముందే
సిగరెట్టు ముట్టించాలి
అలారం మోగకముందే
కాలాన్ని కిడ్నాప్ చేయాల్సింది
మిత్రుడా మిత్రుడా మిత్రుడా
నువ్వెన్ని చెప్పు
నేనిప్పుడిక భోంచెయ్యాలి
ఆఫ్రికన్ మూలం : ఒక మాగిడిగోగరి

(వ్వె ... వెవ్వె.)

19-5-93

ఒకే కసి

ఒకే గురి

ద్వేషం వినా మరో మార్గంలేదు

రాబందుమీద దాడికి సిద్ధమవడం

మినహా చేసేదేం లేదు

ఒకే లక్ష్యం

ఒకే పక్షం

మట్టి మీద మొలచిన శ్రమ సౌందర్యాన్ని

పునః ప్రతిష్టించాలి

మట్టిలో యింకిన నారక్తం సాక్షిగా

మృత్యువుతో ముఖాముఖి తేల్చెయ్యాలి

ఒకేదారి

ఒకే దరి

ఉప్పెనవుతున్న నా పూర్వికుల జన సముద్రంలోకి

ప్రవహించాలి

ఆకాశం నిండా ఎరుపెక్కుతున్న భవిష్యత్తులోకి

దూసుకుపోవాలి

ఒకే మనిషి

ఒకే మనిషి

నడుస్తున్న మేరా యింద్రధనస్సులు

పూయిస్తాడు

పూపిరినిండా యితరులకు స్వప్నాల లేపనాలు వేస్తాడు.

జీవితం

రాత్రంతా
కలల కౌగిలిలో
పరవశించిన
హృదయం
భళ్ళున తెల్లారాక
గొళ్ళు మంటుంది
సత్యాసత్యాల
తక్కెడ్ని
పరిశీలించకుండా
జీవితాన్ని బేరం పెట్టినందుకు
చింతిస్తూ కూర్చోవాలనుకొంటుంది
కానీ, ఆకలి - హఠాత్తుగా గాండ్రిస్తూ మీద పడే పెద్ద పులి
మింగేస్తుంది హృదయాన్ని
అప్పడు మళ్లీ
మామూలవుతుంది జీవితం

23-8-86

పేరులేనితనం

ఘోరున దుఃఖాన్ని రాయలేనితనం
రెండుగా చీలిపోయే అస్తిత్వాన్ని అనువదించలేనితనం
యినుప స్థంభంలా వికసించని ప్రేమ రాహిత్యం
పశువులు తొక్కిన పిల్లనగ్రోవి లాంటి హృదయాన్ని
ఎక్కడో దారబోసుకుంటాను
శాపంలాంటి యవ్వనంలోంచి బాల్యంలోకి
విముక్తికోసం ఆకాశం క్రింద అలమటిస్తాను
ఆకలిగొన్న జంతువులాంటి దేహాన్ని యే
గుహలోకి తరమాలి?
....
ఎప్పడూ రెండూ ప్రపంచాల మధ్య ఘర్షణ
విప్లవానికీ ప్రేమకూ మధ్య
ఉనికికీ స్వప్నానికీ
ఆలోచనకూ ఆచరణకూ
ఎప్పడూ రెండు కోర్కెల మధ్య వూగిసలాట
కలకూ నిజానికీ
గాలిలోకి లేచే భావచిత్రాలకూ - భూమిలోకి కృంగే
నిర్లజ్య వ్యామోహాలకూ
....
చెప్పలేనితనం
బిగ్గరగా అరచి ప్రకటించలేని తనం

ఓస్! గట్టిగా యేడ్వలేని తనం
బిగ్గరగా హత్తుకోలేను
నడివీధిలో ఆకళ్ళలోకి చూస్తూ పరవశించలేను
ఒకే ఒక క్షణం ఆయుధం లేకుండా చిర్నవ్వలేను
ఒక్కరోజు చలించకుండా నడవలేను
పలవరింత లేని నిద్రరాదెన్నటికీ
....
ప్రేమలేని తనం
ఆకాశంనుంచి కురుస్తున్న అశ్లీల వాల్ పోస్టర్ల కుండపోతలో
తడిశాక
దేహాన్ని తప్ప దేన్నీ చూడలేనితనం.
....
సరుకులై మెరిసే నక్షత్రాలకవతల ఆకాశమొకటుందని
జ్ఞాపకం లేనితనం
రెండు రూపాయి నోట్లు ముద్దిడుకొన్నపుడు తప్ప
పులకరించలేనితనం
....
ఉండలేనితనం
ఒకచోటే పహరా కాయలేని తనం
నిరంతర పరకాయ ప్రవేశం
జీవితం నిండా పేరులేనితనం

రాత్రి 8-30
19-6-'94

జ్వరంలోకి.......

నిశ్శబ్దంగా మీద పడే కొండచిలువలా
మెల్లగా నన్నాక్రమిస్తుంది
మత్తుగా సోలుకుంటూ యిల్లు చేర్తాను
అంతవరకు ఏకాంతంలో తపస్సు చేసుకుంటున్న
ఋషిలాంటి యిల్లు నన్ను కౌగిలిలోకి తీసుకొంటుంది
మెల్లగా చాపమీద వాల్తాను
నా చుట్టూ నాలోని సెగ దడికడుతుంది
హఠాత్తుగా నిద్రలోకి ప్రవహిస్తాను ....
మళ్ళీ పొగమంచు విడిపోతుంది
సముద్రంలో కెళ్తున్న నావలాంటి గదిలో
రెప్పలు విప్పతాను
ఎవరిదో చల్లటి అజ్ఞాతహస్తం కోసం - ముఖ్యంగా స్త్రీది
వేడి తనువు తపిస్తుంది
ఎవరో నుదుటి మీద లేత పెదాల్తో ముద్దిడుకొన్నట్టే వుంటుంది.
వేడిని కొలుస్తున్నట్లే వుంటుంది.
వున్నట్టుండి నిరాశలోకి దిగబడిపోతాను
'ఈ దీవి వైపు యే నావా ప్రయణించాదా'
జీవితమంటే బ్రతుకూ చావే కదా అని
నాకు తెలియకుండానే తత్వచింతనను
కాసేపు దుప్పటిలా కప్పకొంటాను
డిజావు - ఈ జీవితాన్ని గతంలోనే గడిపిన అనుభూతి
ఆదిమ జ్ఞాపకాల్లా పలవరింతలు
ఎవరో తరుముకొస్తున్నట్టు వుంటుంది.
వులిక్కి పడి లేస్తాను
దాహం.... దాహంతో స్పృహ కోల్పోతాను.

27-10-93

చీలిన ఆకాశం

యిద్దరు మనుష్యుల మధ్య
ఒక అగాధం
యిద్దరు మనుష్యుల మధ్య
చీలిన ఆకాశం
యిద్దరూ విసిరివేయబడ్డ
రెండు ధృవాలు
పరస్పరం సరుకులై
మారకమవుతారు
తడిలేని పెదాలతో
ముద్దు పెట్టుకుంటారు
ఒక గొప్ప నాటకాన్ని
రహస్యంగా రక్తి కట్టిస్తారు
రెండు దేహాలకోసం భూమిని
నిలువునా చీలుస్తారు
యిద్దరూ రెండు
సుదూర ఖగోళాలు
ఒక నక్షత్రం కోసం ఆకాశాన్ని
రెండుగా పంచుకొంటారు
ప్రపంచానికి అటూ యిటూ
వికసించని రెండు
యినుప స్థంభాలు

3-3-96

అడుగుజాడలు

బరబరా ఈడ్చుకు పోయే అనాధ శవం - జాడ
ఒక గ్రుడ్డివాడి నడక - జాడ
క్రింది చూపు ఒక్కటే వుండటం - జాడ
ఆలోచనల చెట్లు మొలవని తల - జాడ
స్వంత క్షణం ఒక్కటైనా లేని కాలం - జాడ
ఎదిగీ ఎదగని మనస్సుపై సమ్మెట
మొలకెత్తే జీవ పరిమళాన్ని
పుటుక్కున త్రెంచే పిశాచి - జాడ
నీడ నుంచి నీడకు ప్రాకిస్తుంది
ఒక మహా అణచివేత తాలూకు సాధారణరూపమే - జాడ
జాడ ఎంత గొప్పగా వుంటే ఏమిటి
జీవితాన్ని చచ్చిన గొడ్డులా భూజాన వేసుకొని స్మశానం వైపు నడిస్తే ఏమిటి?
అనుకరణా అనుకరణా
నువ్వొక కదలని కొండవి
నువ్వొక నీడవి, నువ్వొక నిశ్శబ్ధానివి, నువ్వొక చీకటివి
'ఫలానా వాడు ఫలానా వాడి అనుచరుడు'
అడుగు జాడల్లో నడిచే వాడు రాటకు కట్టిన మేక
కొక్కికి వ్రేలాడుతున్న మొదడును ఎవరో తీసుకొని పోతుంటారు
ఇంజను వెంట పరిగిత్తే రైలయినాడు!
ఒక నాగరికత నిండా, శిథిలమైన ఒక మహానగరం నిండా
ఒక అంథః చరిత్ర నిండా తుది మొదలు లేని అడుగు జాడలు

24-8-95

నేలతల్లికోసం

నిన్నేమని పిలవను
నీతో ఏం మాట్లాడను
విత్తులు నాటాల్సిన కాలం
తొలకరి జల్లులు పడి
బుస బుసా పొంగిన మట్టివాసన
నా శరీరాన్ని కుదిపేస్తున్నది
నీకూ నాకూ మధ్య మిలిటరీ గోడ
ఘనీభవించిన కొండల మౌనం
మనిద్దరి మధ్యా ట్రెంచ్‌లు
నాకోసం పలవరించే నిన్ను
ఎట్లా హత్తుకోను
బుజ్జి పాపాయిలా ఎలా లాలించను
నాయింటి ముందు బంకరు దాటి
యిన్‌ఫార్మర్ డేగ చూపు దాటి
సరిహద్దు భద్రత ల కవాతుదాటి
ఏ అర్ధరాత్రి నిన్ను చేరుకోను
నా కన్న తల్లీ

నాకు జన్మనిచ్చిన దానా
నిన్నెలా నావళ్ళో పడుకోబెట్టుకోను
నా ఆరోప్రాణమా
నా జీవనాడీ, నాజన్మసాఫల్యమా
ఈ వుక్కు వూచల్ని దాటి
నెంబరు ప్లేటుల్లేని జీబుల పెట్రోలింగుల్ని దాటి
తెల్లవారుజాము ఎన్‌కౌంటర్లను దాటి
ఎలా నిన్నందుకోను
విత్తాల్సిన తరుణం దాటిపోతున్నది
దుక్కిదున్ని, పారతో పెళ్ళగించి
దుమ్ము దుమ్ము చేసి నీరు పారగట్టి
విత్తాల్సిన చేతులు
లాఠీల క్రింద నలిగిపోతున్నాయే!
అయ్యో! నా నేల తల్లి
నీకు అన్నం పెట్టాల్సిన వేళ
జైళ్లో నేను నిరాహారదీక్ష చేస్తున్నాను
నీమీద యినుపబూట్లు సంచరిస్తున్నయట
తుపాకులు నాటుతున్నారట
రక్తం పారగట్టు తున్నారట
శవాలతో గట్లు వేస్తున్నారట
అంతా తెలుస్తున్నది
కాలు సూర్యుడిలా గమనిస్తున్నది
ప్రజలు ప్రతీకారం కోసం పథకాలు రచిస్తున్నారు
భూమితల్లీ - విచారించకు
నీకోసం మేం వేకువలై వస్తాం.
తొలకరి జల్లులైవస్తాం

25-8-'95

పునరుత్థానం

వొరిగిపోయిన వాళ్ళు మళ్ళీ మళ్ళీ పదునెక్కుతారు
నరకబడ్డ చెట్టుమీద ఎప్పటికప్పుడు శిరస్సు మొలుస్తుంది
భూమిలో నానిన దేహం ఎప్పటికప్పుడు మొలకెత్తుతూనే వుంటుంది
ఛిద్రమైన భూమి మీద శిథిలనగరాలు పుష్పిస్తూనే వుంటాయి
గాయాల మీద మృదుజీవం వెన్నెలై పొటమరిస్తుంది
దహనమైన అరణ్యాలు ఆయుధాలై వికసిస్తాయి
పునరుత్థానం చరిత్ర వీరులకిచ్చే వరం

24-10-95

సంస్మరణ సభ

క్యాంపు క్యాంప్ క్షతగాత్ర శిబిరమయ్యింది
గాయపడిన ఆసుపత్రయ్యింది
ఒక మహా దుఃఖ సముద్రమై అలలహోరెత్తింది
కొట్టుకోవడం ఆగిపోయిన గుండె అయ్యింది
గాలినిండా, దూళినిండా, గలగలలాడటం
ఆపిన ఆకులనిండా, నీ రెండ వెలుగు నిండా
బిగబట్టిన వుచ్ఛ్వాస, నిశ్వాసాల నిండా
ఒక సజీవ జ్ఞాపకం ప్రవహించింది
మాటల్రాని వుపన్యాసకుడు నిలువు నిలువునా
కన్నీళ్లై భోరుమన్నాడు. గతం వెక్కిళ్ళగా
ఆతన్ని కుదిపేసింది, వేర్లు తెగిన చెట్టై అల్లల్లాడాడు
విషాద సంగీతంలా చెక్కిళ్లపై జాలువారుతున్న జ్ఞాపకాశ్రువుల్తో పాటు
మంద్రంగా మాటలు గాలిలోకి కలిసి శ్రోతల నాభినుంచి సుళ్ళు
తిరుగుతూ కన్నీళ్లయినాయి
ఒక క్షణంరోదనలతో అరణ్యం కంపించిపోయింది

-7-౨౫

ఒక రాత్రి

తలుపులు తెరచుకొనే వుంటాయి
దేహం నేలమీద పుప్పొడి రాలుస్తూనే వుంటుంది
వానకోసం ఆకాశాన్ని గానం చేస్తున్న భూమినుంచి
సంగీతం వినిపిస్తూనే వుంటుంది
రహస్యంగా తాకేగాలిలాగా గాయపడ్డ నేలనుంచి పాట
తరంగాలు తరంగాలుగా స్పృశిస్తూనే వుంటుంది
వుండుండీ రాలని పచ్చి జ్ఞాపకమొకటి
హృదయం మీద చెవి పెడుతూనే వుంటుంది
పండుటాకుల మీద ఒత్తిగిల్లి చెట్ల ఆకుల సందుల్లోంచి
ఆకాశం కేసి చూస్తున్న గెరిల్లా వీరుడి కళ్ళల్లోంచి
ఒక అజ్ఞాత స్వప్నం నాలోకి ప్రవహిస్తూనే వుంటుంది
రెప్పలు మూయని రాత్రి నల్లగా రోడ్డుమీద ద్రవిస్తుంటుంది
రేపు విత్తబోయే పంటగూర్చి తలపోసే రైతులా
ఒక్కో క్షణమే భవిష్యత్తులోకి ఆవిరయిపోతాను
రాత్రి నన్ను వెచ్చగా కప్పుకొంటుంది

26-2-94

ఒత్తిడి

నువ్వు పాదంమోపిన చోటల్లా నీలిపడగ విన్యాసం బుసకొడుతుంది. మరీచక దూరానికి చేయి చాసేందుకోసం మళ్ళీ ఒక ప్రయత్నం చేస్తావు. దట్టంగా కమ్ముకొన్న జీవితంలోంచి వూపిరాడక గిలగిలలాడుతావు. వినేందికు హృదయం దొరకదు. పువ్వుకాదు కదా తొడిమ కూడా చిర్నవ్వదు. ప్రేమలాంటి నక్షత్రఖచిత ఆకాశమొకటి స్వప్నంలా బులిపిస్తుంటుంది. ఎవరు తెరుస్తారు కిటికీలు? గుహతొలిచే పులికోసం అన్వేషిస్తావు. ఎప్పటికప్పడు నీడను తరిమికొడతావు. కనిపించిన దారెంబడి నడుచుకొంటూ పోతావు. ఎవరొస్తారని తోడు? కత్తులు లేని ఆకురాయి గరుకుదనం యవ్వన చర్మం పొడవునా వొరుసుకొంటూ వుంటుంది. భూమి కన్నా శరీరం భారమవుతుంది. దేహం గుండా భూమధ్యరేఖ దూసుకోపోతున్నచప్పడుకు వులిక్కి పడతావు. పోటెత్తే రక్త సముద్రానికి హైబిపి అని పేరు పెడతాడు డాక్టరు. మొదడు నిండా క్షణాలువుబ్బిన శవాలవుతాయి. మృదువైన సంధిగ్ధ సంధ్య కూడా ఈడిపస్ కాంప్లెక్స్‌లా అనీజీగా క్రమ్ము కొంటుంది. వున్నట్టుండి కట్టలు తెంచుకొన్న మురికి నది వొక్కటి నీ లోపలి నుంచి లోపలికి వొరుసుకొని ప్రవహిస్తుంది. క్రమంలోంచి క్రమం పుట్టి క్రమంలోకి వెళ్ళి పోతుంది. నువ్వొక దీర్ఘ నిశ్వాసమవుతావు.

20-12-94

కొన్ని పిట్టలు, పురుగులు

నీడ క్రింద మనిషి
పొంచివున్న మృత్యువు
ఎగురుతున్న కల
అతడిగది

★★★

తోడురాని రాత్రి
ఖాళీ అయిన జోబీ
క్షణికం

★★★

నడుస్తున్న సూర్యుళ్ళు
జీవితంలో వూబి
అడవి

★★★

పిలకాయలకు సెలవు
విడుదలైన జైలు
ఆయన వర్ధంతి

★★★

ఆయన చనిపోయాడు

అందరూ గొల్లుమన్నారు
ఆమెకి స్వేచ్ఛ

★★★

అతడు మగవాడయ్యాడు
లోకం నిండా చప్పట్లు
ఆమె లేచి పోయింది.

★★★

కుండపోతగా వాన
గొడుగు క్రింద ఆమె అతన్ని ముద్దు పెట్టుకొంది
నిద్రపోయిన ఆఖరు ప్రేక్షకున్ని బయటకు
పంపాడు థియేటర్ వాడు

★★★

తప్పట్లూ తాళాలు సిద్ధమయ్యాయి
బండ్లు నాగళ్ళు కొడవళ్ళతో రైతులు గుమికూడారు
దేవున్ని మొక్కడానికి కాదు

★★★

అతడు నల్లగా నిగనిగలాడేడు
గర్భగుడి తలుపులు తెరచుకొన్నాయి
గోతాలు క్రిందుగా నదిలో కలిసింది - రక్తం

★★★

చెట్టు మీద కెక్కుతున్న కొండచిలువ
రేవులోకి దిగుతున్న పెద్దపులి
ఎంతకీ నిద్రపట్టని యవ్వనం
ఒక రాత్రి

★★★

ముఖానికి పసుపు పూసుకొన్న సంధ్య
బారులు తీరిన పక్షులతో ఆకాశం
పోరాడుతున్న మనిషి

★★★

పకపకా చిరునవ్వు
లేత ఎండ స్పర్శ
రెండొకట్లు ఒకటి
జారిన కాలు

★★★

ఆకాశం నిండా పొగ
అడివి నిండా హాహాకారాలు
బొగ్గులై నగరాలకి చేరిన శరీరాలు
గృహదహనం

★★★

కలకలారావాలు కరవాల నాదాలు
శరీరం మీద నిక్క బొడిచిన స్వప్నాలు
వొడుపుగా పట్టు దప్పిన జీవితం
నాయింట్లో విదేశీసంగీతం

★★★

కొండ చిలువ లాంటి రాత్రి
ఎంతకీ కురవని వాన
శబ్దం చేయని రోడ్డు
బోర్లించిన ఖాళీ కుండ
తెరచిన పుస్తకం మీదుగా
గూడల్లుతున్న సాలీడు
వెల్లకిలన యవ్వనం
లాక్ చేసిన నైన్ యం. యం. పిస్టల్ లామౌనం
సర్కారు చెట్టు దగ్గర విలపిస్తున్నకామ సూత్ర తొడుగు
ఆమె ముగ్గేసేందుకు వంగినపుడు
చోలీకీ పీచే క్యాదేఖ్ రేహైతుమ్?

౨-౮-౨౩

ఖాళీలను పూరించేవాడికోసం

నడుస్తున్న వాడి ఆనవాలు కావాలి
బలితీసుకొన్న వాడి ప్రాణమెక్కడ దాచారో చెప్పండి
అవును నాకిక వేరే పనిలేదు
గంట వినా వేరే శబ్దంలేదు
జలిగిపోయిన రహస్యాన్ని
భుజాన వేసుకొనే భేతాళుడి కోసం వెతుకులాడాలి.
''ఎవడ్రా నన్ను విద్రోహి అనింది'' యీ దారిలో పరిగెత్తిన
ఉన్మత్తున్ని మీరు చూశారా?
చిల్లుపడని నావకోసం పలవరించిన
పదహారేళ్ల అమ్మాయి జాడ తెలియాలి
లంగరుకు వేలాడుతున్న నాదేశ వెన్నెముకను నాకిచ్చేయండని
గోల చేసే పసివాడి ఆర్తనాదం వినాలి
కూల్చని గోడ కోసం వేరుపడిన నా అర్థబాగం లోకి
నేనిప్పుడు అగ్ని ప్రవేశం చేయ్యాలి
పడగవిప్పిన నల్ల త్రాచుతో నన్నిప్పుడు స్నేహం చెయ్యనివ్వండి
నిద్రరాని రాత్రిళ్లకోసం సిగ్గిడిసి పరిగెత్తిన
ఆ యువకుడింకా తిరిగిరాలేదు
సరిగ్గా అప్పడే కుబుసం విడిచిన ఒక సంక్షుభిత ఆకాశం
మందిలో కల్సి పోయింది
యిక రోడ్డంతా ఖాళీనే!
గుప్పు గుప్పు గుప్పు మంటున్నది
నగరాల మీదుగా పల్లెలకు వీస్తున్న మతాభస్మం
అంతా సిద్ధం చేశాక
నడిచి వస్తున్న ఆ నిటారు మనిషి కోసమే
నా నిరీక్షణ.

రాత్రి 8.00, 8-8-93

నిషిద్ధక్రీడ

కంఠాలు రుద్ధమవుతాయి

ఎంతకీ నడవని రోడ్డుతో ఒంటరిగా మాట్లాడాలని ఒకటే కోరిక!
కోడిని నోటకరచుకొన్న నక్క ఎటు పరిగెత్తిందో
యింత వరకు తెలియదు
రాబోట్ శరీరంలోకి మనవాడెప్పుడు ప్రవహించాడని
ఒకటే ప్రశ్నలు ప్రశ్నలు
గాలినిండా, దూళి నిండా, విషాద మాధుర్యపు కంఠం నిండా
నువ్వే నువ్వే నువ్వే
పోరాట మొకటే మిగిలిన శ్వాసనాకు
ఆఖరిమెట్టు మీద ఆటలాడే సరదా దారపోయింది
'అనుల్లంఘనీయమైనదేదీ జీవితంకాదు'
ప్రకటించిని వాడిప్పుడు పోలీసు కస్టడీలో వున్నాడు
మిత్రుడా, ఒకసారిటొచ్చి ట్రిగ్గరు నొక్కు
చిరునవ్వు మరచి పోయిన వాడి చిరునామా
చెప్పేదెవరు?
ధ్వంసమయిన 6 వ శతాబ్దం నాటి చర్చి నిండా
ప్రార్థనలు ప్రతిధ్వనించాయంటే నమ్మేదెలా
మిలాన్ లో RDX సాక్ష్యమిచ్చిందంటావా
చుట్టూ యినుప పూచలు బిగినట్లు నిశ్శబ్దం
టుసర్ విత్ సారీ' ఆత్మహత్య చేసుకొన్న
విద్యార్థి లేఖ గాలికి రెప రెపలాడుతోంది
లాంతరు వెలుగు నిండా భీతావహపు నీడ
నాదేనంటే నమ్మకం లేదు
కొత్తగా వచ్చిన వాడా, చివరిసారిగా ఆయుధమందుకో

28-8-93, రాత్రి 8.30

కన్నెతో సంభోగం లాంటి ఒక ఆదిమ కోరిక
పదవ తరగతి ప్రేమలాంటి ఒక అబద్ధం
లోనెక్ జాకెట్ లాంటి ఒక నిజం
మళ్ళీ పుట్టకూడదన్న కసి
శరీరాలు విడివడిన చప్పడు
ఎంతకీ గుర్తుకురాని తొలిరాత్రి

★★★

ఆమె తలలో అతని వెంట్రుక గిల గిల
లాడుతోంది
అతడి దేహం మీద ఆమె కోరిక కత్తిలా
వేలాడుతొంది
క్రీ.పూ. 567 నాడు అతడిచ్చిన
ముద్దు పరిమళం ఇంకా గుప్పమంటోంది.

కవలం

అందరూ నిద్రపోతున్నారు రాత్రి తలక్రిందులుగా వ్రేలాడుతూ ఉంది. ఉలిక్కిపడి రెప్పలు విప్పాను - భయంకరం రెప్పలు ఎక్కడో రాలి పడి పోయాయి. రెప్పలు బదులు రెండు పురుగులు. నా చూపుల్నిండా జరజర లాడే పురుగుల దేహాలు చేతిలో విదిల్చాలని చూశాను. మతి బోయింది చేయి కన్పడలేదు. ప్రక్కన ఉండచుట్టిన న్యూస్ పేపరు కాలు కదిపాను - మంచం కోడై పోయింది. అలాగే మొండిగా పెరట్లో కొచ్చాను. కీచు మన్నాను. గబ్బిలాలు నృత్యం చేస్తున్నాయి. ఇంటి కప్పమీద కెక్కాను కొక్కరోమన్నాను. నా మొండెం కన్పించలేదు. బిగ్గరగా నోరువిప్పాను. శబ్దం రాలేదు. హఠాత్తుగా రోడ్డు మీద చూచాను. చక్కటి స్యూట్‌లో అక్కడ ఒక వ్యక్తి నడచి వెళ్తున్నాడు. మనుష్యులతో కరచాలనం చేస్తున్నాడు. చిరునవ్వులు విసుర్తున్నాడు. దానధర్మాలు చేస్తున్నాడు. ఆనందంగా హుందాగా చలాకిగా ఉన్నాడు - ఎవరు వాడు? ఇంకెవరు ? నేను నేనే

ఇక్కడి నేను నేనే - అక్కడి నేను నేనే

రెండు నేనుల నేను ఇప్పుడు కుబుసం విడిచాను

రెప్పల మీద పురుగుల నేను అలా సముద్రంలోని నడుచుకొంటూ వెళ్లాను

పుల్ స్యూట్ చలాకీ నేను బహిరంగ సభకి వక్త నయ్యాను

౧-౨-౯౧

రోడ్డు మీదికి పోలేక పోయిన వాడు

రాత్రి కిరీటం ధరించిన మనిషొక్కడు నా దగ్గరకొచ్చాడు జాలిగా నా వైపు చూసి
''క్షుద్రుడా ఇంకా నిద్రపోతున్నావా బయట రోడ్డు మీద కళేబరాలు చూళ్ళేదా'' అన్నాడు.
''ఏమిటి విశేషం''
''అరే బాడకోవ్ మనుషులు ఎదురు తిరగడం నేర్చుకున్నాక శవాలు కాక వాళ్ళేమవుతారు''
''అయితే నేనింకా బతికే ఉన్నానా''
''నువ్వు ఎదురు తిరిగే వాళ్ళను గూర్చి పాట కట్టు తున్నావు. కాబట్టి నువ్వు బంధీవి మాత్రమే''
నేను కళేబరం కాలేక పోయినందుకు భోరున ఏడ్చాను

గాయాలకు హృదయం లేదు
గుండెగాయాలకు కరుణ తెలీదు
ఓదార్చలేని ప్రేమకు ముళ్ల కంప మీదే మక్కువ
నిజాలు తలక్రిందులుగా వ్రేలాడుతున్న గబ్బిలాలు
నేనూ గుల్‌మొహర్ చెట్టు ఒక్క లాగే నిలిచిపోయాం
ఒక్క లాగే - ఒక్కలాగే - ఒక్కలాగే
ఎంత పిండూ - ఎరుపు పోదు.

5-6-93

★★★

ముగ్గురే ముగ్గురు
మనరేపటి వసంతం కోసం
యివాళ అరెస్టయినట్టువార్త
నేరానికి కొత్త నిర్వచనం యిచ్చినందుకు
మా మనుషులకు శాశ్వత బంధిఖానా

★★★

ఒకడు మనకోసం బుద్ధుడైనాడు
ఒకడు యశోధర కోసం గృహస్తుడయ్యాడు
ఈ ఒకడు స్వప్నభవిష్యత్తు కోసం పూర్తిగా
స్వేచ్ఛ కోల్పోయాడు

అచలనుడు

ఉన్న ఆ ఒక్క మనిషీ వెళ్ళి పోతుంది
నిర్దయగా తిరిగి చూడని కాలం
గోడల్ని బ్రద్ధలు చేస్తున్న వెర్రి గాలి మాత్రమేం ఊరడిస్తుంది?
నహుషుడొక్కడే దూరంగా తచ్చాడుతాడు
ఆనవాలు లేని హంతకుడొక్కడు నిశీథిడొక్కలో
పొడుస్తాడు. కిక్కురుమనదు.
ఒక విపత్కర సాయంత్రం మొలచుకొచ్చిన
కవిత్వం నిండా గబ్బిలాల కంపు
నథింగె నెస్ నథింగ్ నెస్ - ఓసీ వెర్రి మానవీ
పెళ్ళి పీటల మీదే పరాయివాడితో లేచి పోలేదెందుకని?
ఒరుసుకొని ఒరుసుకొని విరిగిన యిరుసుక్రింద
విరిసిన చలన పుష్పం వెదజల్లని సుగంధంలా
జ్ఞాపకాలు.
రాయ్‌నీ, రాయ్‌నీ, రేయి మీద ఒంటేలుకు పోసుకొనీ.
చమత్కృతులప్పుడు నిద్రలేపే వాడెవడైనా వున్నాడా?
యింకా ఆఖరి అంకం ప్రారంభంకాలేదు
ఆప్తులెవరూ ఎన్‌కౌంటరు కాలేదు
నాదాకా మొలవని గోడకోసం ధర్నా చేయక్కర్లేదు
వెంటాడుతున్న పురాతత్వ అమానుషుడొక్కడు
వూసలివిల్లి ముఖంతో నిర్లజ్జగా నాలోకి ప్రవేశిస్తాడా -
యిక ఆనాటికి తెరవాలుతుంది.

18-6-93, రాత్రి 11.00

మనం గొంతులతో మాట్లాడుకోవడం మొదలెట్టినప్పడే
పువ్వుకి తొడిమకి మధ్య
నీకు నాకు మధ్య
అలలు లేని భీభత్స సముద్రం రెప్పలు తెరిచింది
పంచుకోవడానికి ఏమీ లేనప్పటినుంచి
కూలిన రెండు కరెంటు స్థంబాలు మధ్య అలా
విసిరి వేయబడ్డ పేలని రెండు అగ్ని పర్వతాలయ్యాం
క్షమించు
ఒకప్పటి నీ అందమైన ముఖం
తోలు కప్పిన పుర్రై నాముందు వ్రేలాడుతోంది
మనకు జీవితమంటే ఏముంది
రెండు శిథిల అవయవాల మధ్య
విద్యుత్తు ప్రవహించడమే కదా
ఒక సుదీర్ఘ శిశిర వసంత రహిత
కాలమిక్కడ ఎప్పడూ వర్తమానమవుతుంది
నీడల్ని మోయలేని శరీరంతో
ఇంకెంత కాలం రాగాల్ని పలికించగలం?
నాకోసం కూజిత స్వప్న కవాటాలు
తెరచిన నీ తనువు మూగవోయనప్పడు
యింక దారీ లేదు జ్ఞాపకమూ లేదు.

10-1-92

స్వప్నించిన రాత్రి

అంధః దివసం పొడుగునా
సాగిన గల గలా .. కలకలా..
అక్కడ ఘనీభవ నిశ్చంచలమవుతుంది!
రెండూ రెండు శ్మశానాలై
పడక గదిలో మౌనంగా కాలుతుంటాయ్
అలసిన హామ్లెట్ ఆలోచించడం
మానుకోంటాడు
జ్ఞాపకాలు కూడా అప్పుడు యాష్ ట్రే లో సిగరెట్టు
ముక్కలవుతాయి
అడవి వదిలిపెట్టిన మానవుడు
ఇంకా యింటికి చేరలేదు
'షట్ శషేమ్' అరుపుతో గుహలన్నీ
మూసుక పోయాయి
ఇప్పటికీ రాత్రి స్వప్నిస్తూనే వుంది.

15-4-91

పగటికల

నదుల్ని ఓదార్చడాని కెళ్ళిన కొంగలు
బారులు తీరాయి
పచ్చల పతకంలా యూనిఫాం
మెరుస్తోంది
ఒక ఎ.కె. 47 గ్రద్దలా నా మీద ఆకాశంలో
ఎగురుకొంటూ వెళ్ళింది
జగత్ దిక్చాతాలంచున యెండ వెండి రజనులా
మెరుస్తోంది
సెంట్రీ కప్పిన దుప్పటి లోంచి ఆప్యాయంగా
నిద్ర తడిమింది
ఉద్విగ్న ఉషోదయపు మంచులో
ఊపిరాడక
జలపాతపు అంచుల్ని కౌగిలించుకొన్నాను
ఆమె
ఒక అవిచ్ఛన్న సుగంధి, నాలోపల ముద్దులై
కురిసిన ఆమె దేహం
తళతళ మెరిసే కత్తిలాంటి చిరునవ్వుతో
ఆమె అదృశ్యమైంది
మళ్లీ కళ్లు తెరవగానే
చిల్లుల అట్టపెట్టెలో నేను

10-1-92

తలక్రిందుల తనం

ఎవరూ మాట్లాడరెందుకని
ఎవరూ పెదాలు విప్పరెందుకని
శూలాలు దిగుతున్న శరీరాలు
ప్రతిధ్వనించవెందుకని?
జన జన జన జన జనకు జన జన జన
జజనక జజనక జజనక జనక జన
ప్రతి గుండె తుడుమై మ్రోగాల్సిన మధ్యాహ్నం
ఈ నిశ్శబ్దం ఎందుకని?
ఎవరక్కడ మౌనంగా చూస్తున్నది?
ఎవరక్కడ నిశ్శబ్దంగా రోదిస్తున్నది?
కంకాళాల రోడ్డు నిండా పట్ట పగలే
ఈ నిశీథి పరచుకొందెందుకని?
ఎక్కడ?
ఈ నగరంలో మనిషొకడుండాలి
వాడేమైనాడు
పూర్వం మనుషులు నివసించే యింటినిండా
శూలాల పులులు తిరుగాడుతున్నా యెందుకని?
మొండేలు లేని తలకాయలు భోంచేస్తున్న
ఆ హోటలెవరిదై వుంటుంది
ఎవరిక్కడ పెద్ద పెద్ద అంగల్తో
రక్తాన్ని తొక్కుకుంటూ నడచి వెళ్ళినవాడు
ఎవరక్కడ సుముద్రాన్నెత్తి భుజం మీదేసుకొని
పరుగెడుతున్నాడు
ఎవరక్కడ దాహార్తికి నెత్తురు పోస్తున్నారు?

వాడు

ఆమెను తలక్రిందులుగా
కౌగిలించుకుంటాడు
వాడు ఆమెను రుబ్బురోలుగా
ముద్దిడుతాడు
వాడు ఆమెను
ద్వార బంధానికి మామిడాకు
తోరణంగా అలంకరిస్తాడు
వాడు
ఆమెను ఇస్త్రీపెట్టెలా
ధగ ధగ లాడిస్తాడు
వాడు
ఆమెను పట్టుచీరలా
పదిలంగా చూచుకొంటాడు
వాడు
ఆమెను దూదిపరుపులా
మెత్తగా హత్తుకొంటాడు
వాడు
ఆమెను వంటింటినిండా
ప్రేమిస్తాడు

ఎమ్మెస్సార్

చిగుర్చిన వేకువతో పాటు ఓ యువకుడు నడవటం మొదలు పెట్టాడు. రాజ్యాన్ని మెడలు వంచడానికై యవ్వనం భవిష్యత్తును విసర్జించింది. కసాయి తనంతో తలపడ్డం కోసం మృదుదేహం యంత్రభూతాలతో పోరాటం మొదలు పెట్టింది. పోరాటం ప్రేమించడం నేర్పింది. శాంతి కోసం తపన యుద్ధనిపుణున్ని చేసింది. జీవితం చావును ప్రసాదించింది. అమాయకంగా పసికళ్ళతో నవ్వుకుంటూ గారడీతో వేలాది కాగడాలు వెలిగించి అతడు క్షణాల మేఘమై సమూహంలోకి ఆవిరయ్యాడు.

పోరుకదా జీవితమంటే
చావుకదా రాజ్యమంటే
మనిషి కదా ఆయుధ మంటే
త్యాగం కదా ఎమ్మెస్సారంటే

అరుణతార, ఫిబ్రవరి ౨౪

అక్షరాయుధం

అక్షర జ్వాలా నేత్రాల్నుంచి జాలు వారుతున్న కవితాధార
వరదై నిన్ను ముంచెత్తుతుంది. ఆరోజు వచ్చితీరుతుంది
'అక్షరాలు చెక్కుతున్నాడు వట్టి పనికిరానివాడు' అని
నన్ను అవహేళన చేశావా రోజు
నా అక్షరాల నోళ్ళు కేకలు వేస్తే భయపడి
నన్ను బంధించి, నా అక్షర దేహాలకి సమాధులు కట్టావ్
అయితే సమాధుల మీద తుపాకులు మొలుస్తాయని నీకు తెలీదు
నీ ఇంటి ముందు జాగిలాలు గొలుసులు తెంపుకొంటున్నపుడు
నీ ప్రహరీ గోడ మీద గాజు పెంకులు
నీ పరుపు మీద పరచుకొన్నప్పుడు
నీ గేటు ముందు కావలి తుపాకీ
నీ గుండెలకి ఎక్కు పెట్టబడినప్పుడు
ద్రోహీ! అర్థమవుతుంది నీకు
నా
అక్షర జ్వాలా జిహ్వల
ఆరని కవితాగ్ని కీలల
ఆయుధ ధగద్ధగలు

అరుణతార, డిసెంబరు 88

అధికవితలు

రాత్రి

నిద్రలోకి తలెత్తబోయాను
దోమలు రక్తనాళాల్లోకి సిరెంజిలు దింపుతున్నాయి
హింసా హింసల చర్చలోకి ముకుళితున్ని
కాక మునుపే హంతకుడి నయ్యాను
నారక్తం జుర్రిన దోమను నేను చంపడం హత్యా!
మళ్లీ మాట్లాడిన పులి భవిష్యత్తులోకి
గాండ్రించింది
రెండు లిప్తల మధ్య
ఆయుధాన్ని కాషస్ చేయడం మరవవు కదా
ఒక పసి పాప చిరునవ్వు నవ్విన తర్వాత
ఇంకా శకటాన్ని లాక్కు పోవడమేంది?
ఇప్పుడు మనందరికీ చీమూ నెత్తూరు
కావాలి
గ్రెనేడ్ విసరడాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి
విను
రాజ్యాన్ని చాంబర్ లోడ్ చేస్తున్నాం
మందు పాతర పేలకముందే సంగీతం ఎందుకు
రచించ్రా!?
మధ్య తరగతి చదువు మీద యాసిడ్ పోద్దామనా
జిప్ తీస్తున్నావ్
నాలుకతో మీసాన్ని తడవడం ఇంకా గుర్తే
మళ్లీ చెట్లు నాటే కార్యక్రమం మొదలైంది
నీడ లేదు, వాడిన మల్లెలకు నీరు లేదు
చుబుకం మీద మ్చ మ్చలు లేవు
బోడోలాండ్ కోసం నిద్రబోయిన

మా మనుషుల సాక్షిగా ఎక్కడా
ఆయుధ పహరా లేదు
తిరిగిరాని బాలరాజుల కోసం బాలనాగమ్మల
వెర్రి ఆక్రోశ రాత్రుల్లో నేను కవిత్వంలోకి
జడుసుకొన్నాను
జైలు దాకా నడవని వాడితో నేనిప్పుడు
మాట్లాడదలుచుకోలేదు
మళ్లీ పుట్టని వాడికోసం పలవరింపెందుకు
చూపుడు వేలు ట్రిగ్గర్ మీదున్నదా లేదా అన్నదే
నువ్వు జీవించి వుండటానికి గుర్తు
మళ్లీ వసంతంలో కల్సుకొందాం
బాల్యమంటే యుద్ధమని తెలిశాక
ఆయుధాల కోసం వెంపర్లాడిన రోజులు
గోదూళి మందుగుండు వాసనతో
నిండిన బీభత్స సాయంత్రాల తర్వాత
బాల్యమంటే భయంతో చెదిరిన గొర్రెల మంద అని తెలిసి
కవచాల కోసం ఆరాటపడిన రోజులు
బాల్యమంటే పలకాబలపాలు కావని
ముందే తెలుసు
బాల్యమంటే గొర్రెలూ బర్రెలేనని
పేడా, మన్నేనని ముందే తెలుసు
బాల్యమంటే గోడ్డు చాకిరేనని ముందే తెలుసు కానీ
బాల్యమంటే కకావికలై పరిగెత్తడమనీ
కమ్మీల వెనక దుర్గంధంలో
గజగజ వొణుకుతూ బిత్తరిగా నిలుచోవడమని
అప్పడే తెలిసినది బాల్యమంటే వొళ్లంతా ఎర్రటి లాఠీ కదుములని
బాల్యమంటే వేడి వేడి బుల్లెట్ వర్షాలని
అప్పడప్పడే తెలిసింది.

రాస్కెచ్చస్

కన్నకొడుకు శవాన్ని మోసుకెళుతున్న తల్లిలాంటి రాత్రి
ఒకడే మరచిపోయిన ఆయుధం
నాయకుడి భ్రమలాంటి స్వగతం
ఎడారి ఇసుక మీద రాసిన కవిత
నీవు కూడా వక్షస్థలంలా భ్రమించిన కవి

. . . .

తెరుచుకున్న రబ్బరు పిడికిలి
యోధులకు మాత్రమే రిలీజయిన సినిమా
జరుగు.... ఇంకా దూరంగా జరుగు
నీకు నువ్వందనంత దూరంగా జరుగు

. . . .

మనుషుల కలలు దొంగిలించిన సజీవ శిలాజం
తలలేని మొండెం నడిచి వెళ్ళిన దిక్కు
కళేబరాల్ని ప్రేమించిన దేవుడు
త్రేతా యుగపు మృత్యువు దూసుకెళ్ళిన శరీరం

. . . .

అనుకరించిన అహంకారం
మ్రోగని గోడగడియారం

భుజం తట్టే స్వంత హస్తం
పరాజితుడి అక్షర ద్రోహం
ప్రేమించలేని కవిదేహం
నిర్భయులు మాత్రమే లొంగుబాటును
నెమరు వేయగలరు
రెండు తలల పామొకటి ఈస్టిండియా కంపెనీ నుంచి
ఇప్పడే వచ్చిం ది.
. . . .
బహుశా ఉదయిస్తూనే
ప్రతి యింటి ముందూ ఒక బోస్టన్ జైలు
పాడుచుకొస్తుంది
డంకెల్ వేటగాడు
ఆర్.డి.ఎక్స్ హంతకి

★ ★ ★

ఏదీ నీ పెదవి
ఇలా దీపం కిందపెట్టు
శూలం గుర్తు అద్దనీ
అటు పక్క యుద్ధం హుంకరిస్తున్నది
ఇక్కడ వీడు కవిత్వంతో దేకుతున్నాడు

ధిక్కరించని వాడ్ని
యిలా పద్మశాలకంపండి
సంకెల తెంపిన వాడికోసం
ద్వారాలు తెరవండి

సముద్రుడు

అతడొక ఆయుధం
రక్తం మరిగే శక్తి
మానవజాతి కనురెప్పల మీద
మొగ్గతొడిగిన ఎర్రటి స్వప్నం
ఈ భూమి మీద నడుస్తున్న జీవితం
అవును! అతడొక యుద్ధం
ఊగిసలాడుతున్న లోలకాల మధ్య
ఒక నిశ్చల ప్రశ్నార్థకం
స్వప్నాలు పూరేకులై రాలిపోతున్న
ఈ నేలలో
స్వప్న సృష్టికోసం అవిరామంగా పోరాడుతున్న నిషిద్ధ యోధుడు
అతడు క్రియాశీలి
కల్లోలిత మానవజాతి నాలుగు రోడ్ల కూడలిలో
హాహాకారాలు చేస్తున్న వేళ
అతడు బుల్లెట్లై వర్షించాడు
నిర్వీర్య జనస్తబ్ధతలోకి
లోహమంటల్ని వెదజల్లాడు
అతడు ప్రేమికుడు
రాలిపోయిన మొగ్గల్ని
ఒడిలోకి తీసుకొని కన్నీరై
కరువు నెర్రలోకి దాహమై జలజల లాడుతాడు
జీవితాన్ని దోసిలి నిండా ఒడిసిపట్టి

ప్రజలపై అభిషేకిస్తాడు
అతడు స్వాప్నికుడు
లోహ భుజంగాల్ని భుజంపై మోస్తూ
కలల రాజ్యంలోకి పొగరేగి పోతాడు
ప్రతి రాత్రీ భవిష్యత్తులోకి
నిదురమేల్కొంటాడు
ఎప్పడూ పరిమళాలు నింపుకొన్న కళ్ళతో
ఆకాశం కేసి చూసేవాడు
అతడు కవి
దుగ్ధాశ్రువుల్ని అక్షరాలు చేయడమెలాగో తెలుసు
హుంకరిస్తున్న కసిని
సిరాలోకి వొంపడమెలాగో తెల్సు
తుపాకిని గూర్చి రాయడమెలాగో
అతని కొక్కడికే తెలుసు
చావును గోడకు బిగ్గొట్టగల ధీశాలి
అంతిమ క్షణంలో కూడా యుద్ధగీతి ఆలపించగలడు
శరీరంలో మండుతున్న తూటాకు ధీటుగా
స్పందించగలడు
అతడు ద్వేషి
పుట్టుకతో శత్రువును గుర్తు పట్టిన వాడు
మరణ శయ్యపై 'ఒరే శత్రువా' అని
సంబోధించిన వాడు
అతడు ఉపాధ్యాయుడు
నేర్పడమంటే జీవించడమని నేర్పినవాడు
చనిపోతూ ఎ.కె. 47 మీద
సంతకం చేసి మనకిచ్చి వెళ్ళిన
మన భోదకుడు

జోహార్ బెంజిమెన్ మొలాసా

ఓ
బెంజిమెన్ మొలాసా
ఆఫ్రికన్ విప్లవ మనసా
అనాది నుంచి
అశేషమై
భీకర సంజనితోత్పాతమై

పెరిగే
వికృత శక్తుల
విచ్ఛిన్న కుయుక్తుల
నడ్డుకొనే
కలం పోరాటంలో
కనుమూశావా?
నీ
ఉడుకెత్తిన రక్తం
సిరాయై
అక్షరమక్షర
మనోకాయాన్న భిషేకించె
గదా!
నీ మరణం
ఓటమి కానే కాదు
చరిత్ర పుటల్ని
చెదలౌరచే
నీచజాతి మానవాళినణచేందుకు
జరిగిన సంకుల సమరంలో

రాలిన పతాక
అదిగో....
నీ అనుయాయులు
ఉగ్రసింహులై
శంఖారావం గావిస్తూ
శత్రు సంహారక్రతు
నిర్వహణలో
నిశ్చల తనులై........

అర్థం కాని అంధకారం

నేను సమాజాన్ని గూర్చి
చదువుతూ ఉంటాను
ఎందుకో పసిపాప
వెక్కి వెక్కి ఏడుస్తూంది
చెట్టు మీది కాకి
హఠాత్తుగా అరుస్తుంది
ఇంటిలోని గుడ్డిదివ్వె
బితుకు బితుకుమంటుంది
ఒంటికాలి బిక్షగాడు
వణుకుతూ వస్తాడు
మూలబడ్డ ముసలి అవ్వ
అర్థంకాని మాటల్ని
గొణుక్కొంటు ఉంటుంది
అర్థంకాని అంధకారం
అంతటా అలుముకొంటుంటుంది
ఆలోచనలావిరై
అలాగే నిలిచిపోతాన్నేను-

22-12-1984

తలవంచదు

అంగం అంగం
వీడిపోయి, జారిపోయి
కుప్పకూలిన
నాటకరంగం -
జీవన జావళీలలో
ప్రతివ్యక్తీ పరిచ్ఛుతుడే
చిత్తం క్షోభిల్లే
ఛురకత్తుల జీవనాలు
పోరాటపు ఊపిర్లు
ఆరాటపు ఆవిర్లు-
మనిషి మనిషి
మెలిగే బాటలో
అనుమానపు నల్లత్రాచులు
అయినా -
వర్షంలో తడిసినా
చలిముంచుకొస్తున్నా
అలసిన జాడ కానరాదు
తుపాకీ ఎత్తిన ఆ చేయి
తలవంచదు - తలవంచదు

9-11-1985

రాతి యౌవనం

జైళ్లోకి పోయిన నా రాతి యౌవనం
సంకెళ్ళు తొడుక్కొని వూర్కే కూర్చోదు
కాపలాకుక్క అరుపుకి బెదరిపోదు
రాతి యౌవనం కరుగుతుంది
మంటల జలపాతమై గుండె కొండని
చీల్చుతుంది-
స్వప్నాల్ని దొర్లించుకొంటూ
దారుల్ని పరచుకొంటూ సాగుతుంది
నా కోసం అడవి దారుల్లో నల్గిన పూలని
పలకరిస్తుంది
నా కోసం - నా మాట కోసం
దిగాలు పడి కూర్చొన్న
ఎముకల గూళ్ళని స్పర్శిస్తుంది
నా కన్నా ముందు పరిగెడిన స్మృతుల
పాదచిహ్నాల్ని తడుముతుంది
ఒకే ఒక బాట వెంట అలుపూ
సొలుపూ లేక సాగుతుంది.

18-1-1988

నాతోరా

నీ జాలి కన్నీటి బొట్లు నా కొద్దు
నీ వేడి నిట్టూర్పులు నాకొద్దు
నా రైలు పరుగెడుతుంటే
స్టేషన్లో నించొని చేయివూపద్దు
నా భుజం మీద చేయి వేయగల్గితే వేయి
నా కంపార్టుమెంటులో కూర్చోగలిగితే కూర్చో
లేదూ - నాకు నీ వీపు చూపించి
పిరికి పాదరక్షలేసుక పరిగెత్తు

18-1-1988

అప్పడు అతను రహస్యానికి రక్తం పోస్తున్నాడు

రెప్పల్లోకి సూదులు దిగిన ఆ రాత్రి
దెబ్బలు తిన్న పాములా మెలికలు తిరిగింది
నూనెలో ముంచిన అరికాళ్ళు కాలుతుండడం చూచి
చీకటి గజగజ వణికింది
నరాల్లో రక్తం కందుతున్నప్పడు
గడియారం భల్లున పగిలింది
మ్....మ్....మ్మంటూ నాభినుంచి
తన్నుకుని తన్నుకుని పగిలిన నెత్తుటి పెదాల్నుంచి
బయటకు రాలేకపోయిన ఆక్రందనను విని
ఆ యిటుకరాళ్ల మాసిన పాతగోడలు
మరొక్కసారి బిగుసుకుపోయాయి
పగిలిన గాయం లోకి దూరిన లాఠీకర్ర
రక్తాన్ని పులుముకొని తృప్తిగా నవ్వింది
నాగరికత మీంచి మొలుచుకొచ్చిన యినుపపాదం
లేతయవ్వన చర్మలాలిత్యాన్ని ఛిద్రం చేయడం చూసి
గోడకు వేలాడుతున్న గబ్బిలమొకటి
వెర్రిగా అరచుకొంటూ బయటకు పరిగెత్తింది
కానీ నా కామ్రేడ్ మాత్రం
తన దేహాన్ని రహస్య కరపత్రం చేసేందుకు
పథకం ఆలోచిస్తున్నాడు.

అరుణతార, అక్టోబర్, ౨౪

అస్థిత్వపు ఒంటరితనం

ఒంటరితనపు
అస్థిత్వం
పక్షిలా ఎగురుదామనుకొంటుంది.
చేపలా ఈదుదామనుకొంటుంది.

ఒంటరితనపు దిగులు
గుండెలో పగులు
ఒంటరితనపు మౌనం
సర్వం తెలిసికోవాలను కొనే
జ్ఞాని అహంకారాన్ని
బ్రద్ధలు చేసే నిశ్శబ్దం!
అస్థిత్వపు ఒంటరితనం
శవం లాంటి మౌనంనించి
వూడిపడే భారపు భావం!
ఏకాకి తనపు రొద
గుండెల్లో ధ్వనిస్తే
గునపంలా పొడిస్తే
అస్థిత్వం ఆలోచనల్లోపడి
మాట పోగొట్టుకొంటుది
అయితే-
ఏకాస్థిత్వం
బహుముఖాలుగా చీలి
ప్రపంచంనిండా
పరిగెడుతుంది.
దూరకాలావధుల్ని
దాటి, అనంత నిశ్శబ్ధాన్ని
భేదించే జీవన సంగీతమై
చిగురిస్తుంది, స్పర్శింస్తూంది!

24-9-87

పాడవాటి టోపీ, సుదీర్ఘ వాలమూ గల ఒక గాయం: కొండొకచో మనిషి

నన్నొక గాయం వెంటాడుతున్నది. ఆయుధ దారులైన కొన్ని అదృశ్యశరీరాలు నన్ను చుట్టుముడుతున్నాయి. ఆ గాయం యిప్పటిది కాదు చరిత్ర నాకిచ్చిన వారసత్వం. పొడలంతా మృత్యువు కమ్మిన రాజ్యం గూర్చి కాదు నేను చెబుతున్నది. యిదొక సామూహిక ఆత్మకథ. నిందాపూర్వకమైన స్వగతం. చూపులుండటం నేరంకాదు. సర్రున దూసే ఖడ్గాలు మెరవడం నేరంకాదు. ఈ దారిని ప్రశ్నించడం నేరం నన్ను గూర్చి నేను వేసుకొన్న విషాద హాస్య సముద్రంతో కలిసి హోరుమని నవ్వడం నేరం చూపుడు వేలు తెరచుకోవడం ద్రోహం కాదు. నాలుగువేళ్ళకు ప్రశ్నలు పాటమరించడం ద్రోహం. నన్ను గూర్చి నేను విచ్చుకోవడం ఒక మహాధిక్కారం. నా దిగంబరత్వాన్ని అందరికీ ప్రదర్శించడం చర్చలేని అపరాధం.

వివర్ణ ఆత్మ వివర్ణ పద్మవ్యూహంలోంచి నేనెలా - బయటకు తోయబడ్డానో తెలీదు. నా నెత్తి మీదొక పాడవాటి టోపి. నా వెనక వొక సుదీర్ఘ వాలం యిప్పడు నా గాయపడ్డ దేహం ఎవరికీ కన్పించదు. నేనంటే ఒక పాడవాటీ టోపి. ఒక సుదీర్ఘ వాలమూ.

(రాసింది ఉదయం 5.30) 5-4-96

''ఆంధ్రజ్యోతి దినపత్రిక'' 24-4-96

చివరి మాట

అతనిలో ''అక్షర జ్వాలా జిహ్వల ఆరని కవితాగ్నికీలల ఆయుధ ధగధ్ధగలు''న్నాయని నాకు తెలియదు. విద్యార్థుల్ని చైతన్యం చేస్తున్న నేరానికి జైలులో బందీగావున్న దాము కవిగా పరిచయమవుతున్నాడు. ఈ కవిత్వానికి చివరిమాట రాయడం ఎంత కష్టమో, (ముఖ్యంగా అతనితో స్నేహం తప్ప వేరే ఏ అర్హతా లేని నాకు) ఆ కవితలన్నీ చదివాక అర్థమయింది. మంచికవిత్వం! అని భుజం చరిచే సాహసం చేయదల్చుకోలేదు. ''ఏడ్పు జలపాతాల్ని సృష్టించే పర్వత శిఖరాగ్రపు ఒంటరితనాన్ని'', శవాల్లా బతుకుతున్న మనుషుల అస్థిత్వాన్ని, నేలను చెరబట్టిన రాజ్యపు వికృతరూపాన్ని 'విలువ' కట్టడం నావల్ల కాదు. మా దాము కవిత్వాన్ని పరిచయం చేసే ప్రయత్నం చేస్తాను.

ఈ వ్యవస్థలోని కుళ్లును నరనరాన జీర్ణించుకున్న నేటి యువతరం ఎంత Frustration కి గురవుతుందో ఈ కవిత్వం చక్కగా వ్యక్తీకరించింది. యువకులు ఒంటరితనంతో, '' యినుప స్థంబంలా వికసించని ప్రేమ రాహిత్యం''తో, ''సిగరెట్ల కొసల్తో కాలాన్ని ముట్టిస్తూ,'' రెడ్‌లైట్ సముద్రంలోకి తమని పొదువుకుంటూ జీవచ్ఛవం లా బతుకుతూ వుంటారు. స్వగతంలా సాగే ఒక కవితలో తన లాంటి యువకుల స్థితిని చెపుతూ ఇలా రాస్తాడు. ''దిండు క్రింద సెక్సు బుక్కు/ గుండె కింద అనీజీ బురద/ ఎవరికి తెలియదు నన్ను గూర్చి''.

మధ్యతరగతి మనుషుల్ని 'చావడం మర్చిపోయిన వాళ్లంటాడు కవి. ఒక రాత్రి నిద్రలో నుంచి లేచి తన దేహం చూసుకుంటాడు ఒక మనిషి. కళ్లకు బదులు పురుగులుంటాయి. కాళ్ళు, చేతులు మొదలుకొని శరీర భాగాలన్నీ మాయమవుతాయి. రోడ్డు మీదకు చూస్తే ఫుల్ స్యూట్‌లో ఒక మనిషి నడిచిపోతుంటాడు. అతను ధర్మదాత, బహిరంగ సభల్లో వక్త, '' ఈ రెండు నేనుల నేను ఇప్పడు కుబుసం విడిచాను'' అని అంటూ మధ్యతరగతి జనాల్లోని

'రెండుగా చీలిపోయే అస్థిత్వాన్ని' బయటపెడతాడు. ఈ కవితలన్నిటికి నాకు బాగా నచ్చిన కవిత 'మధ్యతరగతి మగవాడు' ఈ కవితలో ఒక సగటు మధ్యతరగతి మగవాడి మనస్తత్వాన్ని చక్కగా వివరిస్తాడు దాము. ఈ సగటు మగవాడు ఎవ్వరితోనూ కలిసి నడవడు, భార్యని హింసిస్తాడు, బడిలో పాఠాలు తప్ప ఏమైనా చెబుతాడు. జరుగుతున్న సంఘటనలపట్ల అతని స్పందన చాలా Casual గా ఉంటుంది. ''గల్ఫ్ యుద్ధం - కొంచెం సేపు మాట్లాడు / ఒక క్షణం పేలుతున్న నగరం మీద / భేష్! ఎప్పుడూ తీవ్రంగా స్పందించకు/ జ్వరం రావచ్చు, ఏడుపురావచ్చు, కసిరాజుకోవచ్చు/ అదేమంత మంచిది కాదు/ ఏ మెరగనట్టేవుండు/ శవం సంగతి తెలీనట్టే బతుకు''.

నగరాల్లో దాహార్తికి నెత్తురు తాగుతున్న వారిని ప్రశ్నించక, నిశ్శబ్దంగా రోదిస్తున్న వారిని, మౌనంగా చూస్తున్న మధ్యతరగతి మనిషిని చూసి '' ఈనగరంలో మనిషొకడుండాలి/ వాడేమైనాడు'' అని కోపంతో ప్రశ్నిస్తాడు కవి. వీళ్లకు ఈ వ్యవస్థ నిజరూపం తెలియదా అంటే ఖచ్చితంగా తెలుసు. ''ఉరితాళ్ల కింద వూపిరి పీలుస్తున్న సంగతి / ఎవరికి మాత్రం ఎందుకు తెలియదు''. దిగజారిందనుకున్న యువతకు ''మాంసం కూరిన సంచుల నిండా యుద్ధపు కమురువాసన'' , ఆలస్యంగానైనా భరించలేని స్థితి కొస్తుంది యువత. ఒక మధ్యాహ్నం సలసలమరిగిపోతూ ఒక మహాధిక్కారమవుతుంది, ''చూచినంత మేరా శవాలు/ పిడికిళ్ళు బిగిస్తున్న దృశ్యం కనిపిస్తుంది. రాజ్య నిర్బంధంలో వున్న నేల తల్లి కోసం విలపిస్తూ వేకువనై వస్తానని కవి చెపుతాడు. నక్సల్బరీస్ఫూర్తితో సాగిన శ్రీకాకుళపోరాటాన్ని పాగిడి, నేటి పోరాటాల్ని వక్రీకరిస్తున్న శత్రువుని సింహాసనాల కోసం హత్యలు చేసేవాడిని నమ్మనని గేలి చేస్తాడు. అజ్ఞాతంలో టీచరు పనిచేస్తున్నపుడు తన సహచరుడు చంపబడితే నిజం చెప్పలేక, దుఃఖాన్ని దిగమింగుతూ ''భవిష్యత్తు నిండా మీ కలల్ని నలిపేస్తారనే/ నిజం యిప్పడు మీ కంతా పట్టించను/ అవును నాబాలమిత్రులారా/ యివాళ పుస్తకం తెరవను/ గొంతు నిండా దుఃఖం పూడుకుపోయింది''. మన విద్యాలయాల్లోని పుస్తకాల్లో నిజాలు లేవని విమర్శిస్తూ మన విద్యావ్యవస్థని ఖండిస్తాడు. ప్రభుత్వ హత్యల గురించి చెప్పలేక దుఃఖంతో కుమిలిపోతాడు.

దాము కవిత్వంలో కొత్తదనం కనిపిస్తుందని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఈ కవిత్వం జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశించిన తీరు బాగుంది. భాషలో సరళత కొరవడింది. కొన్ని కవితలు అస్పష్టత కారణంగా సూటిదనం లోపించింది. ఈ లోపాలు ఒక కొత్త కవిలో ఉండడం సహజమే అయినా, కొంచెం ఎడిట్ చేసుకుని, రీ రైట్ చేసుకుంటే బాగుండేది.

విప్లవ కవిత్వం ఒక మూసలోకి పడిపోయిందని విస్తృతి తగ్గిందని అనే వారు ఈ కవితలు చదివితే మంచిది. మన జీవితాల్లోని పరాయీకరణను, డొల్లతనాన్ని, హిపోక్రసీని, శవాల్లా బతికే తీరుని నిరసిస్తూ ''గుండె కింద అనీజీ బురద'' ని చూపి ఒక ఎమ్మెస్సార్‌లా యువకులంతా ''శాంతి కోసం యుద్ధనిపుణులు'' కావాలని, సముద్రుడిలా ''రాలిపోయిన మొగ్గల్ని/ ఒడిలోకి తీసుకొని కన్నీరై/ కరువు నెర్రలోకి దాహమై జలజలరాలా''లని చెపుతాడు.

- సత్యం

70

నేను ఒక కలను కంటుంటాను.... కొద్దిసేపటి తర్వాత మెలకువ వస్తుంది. చుట్టూ వున్న పారదర్శక జీవితాన్ని తడువుకుంటాను. మళ్ళీ నిద్ర, కల కొనసాగుతుంది. అయితే సీక్వెన్స్ వుండదు. అన్నిసార్లు........

సరిగ్గా నా కవిత్వము అంతే.

– దాము